క్లుప్తంగా

అలరించిన దుర్యోధనుడి వధ



తలపడుతున్న దుర్యోధన, భీముడి పాత్రధారులు

రామచంద్రాపురం: మండలంలోని అనుప్పల్లి పంచాయతీ నూతిగుంటపల్లిలో పంచమ వేద మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధనుడి వధ ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. దుర్యోధనుడిగా మునిక్రిష్ణ, భీముడిగా నరసింహులు అద్భుత ప్రదర్శన చేశారు. వందలాది మంది భక్తుల గోవిందనామ స్మరణ నడుమ అమ్మవారి అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు వెంకటరెడ్డి, నిరంజన్‌రెడ్డి, మునిక్రిష్ణారెడ్డి, పాటూరు నాదముని పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ మృతులకు కొవ్వొత్తులతో నివాళి



కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న ఎన్‌జీఓ సిబ్బంది

పాకాల : హెచ్‌ఐవీ బారిన పడి మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ఆదివారం పాస్ ఎన్‌జీఓ ఫీల్డ్ వర్కర్ లక్ష్మి, బాలాజీ, సీబీఓ అలివేలు ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. వారు మాట్లాడుతూ హెచ్‌ఐవీపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. నివారణ ఒక్కటే మార్గమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు హేమావతి, లక్ష్మి, రేవతి, దీప, మంజు తదితరులు పాల్గొన్నారు.


తిరుచ్చిపై శ్రీకృష్ణస్వామి విహారం



తిరుచ్చిపై ఊరేగుతున్న రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి

తిరుచానూరు(చంద్రగిరి) : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ అనుబంధ శ్రీకృష్ణస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారు తిరుచ్చి వాహనంపై భక్తులకు అభయం ఇచ్చారు. స్వామివారి జన్మనక్షత్రం రోహిణి సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారు జామున సుప్రభాత సేవతో మేల్కొపి నిత్యకైంకర్యాలు చేశారు. అభిషేక సేవ అనంతరం వజ్ర, వైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో విశేషంగా అలంకరణ చేపట్టి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి సాయంత్రం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామివారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాఢ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఏవీఎస్‌ఓ శైలేంద్రబాబు, సూపరింటెండెంట్ మధు, అధికారులు సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నిర్మూలనే లక్ష్యం



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీహరి

తిరుపతి తుడా: జిల్లాలో హెచ్‌ఐవీ నిర్మూలనకు పకడ్బందీ చర్యలు చేపట్టామని, మహమ్మారిని అరికట్టేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నామని డీఎంహెచ్‌ఓ శ్రీహరి తెలిపారు. ఆదివారం నగరంలో అంతర్జాతీయ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే ర్యాలీని ఆయన ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి మౌనం పాటిస్తూ క్యాండిల్స్‌తో రామకృష్ణ డీలక్స్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ హెచ్‌ఐవీ కారణంగా వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. విచ్ఛిన్నమైన వారి జీవితాలను పాఠంగా నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. 1983 నుంచి ప్రతి సంవత్సరం మే మూడో ఆదివారం క్యాండిల్ ర్యాలీని జరుపుకోవడం ఆనవాయితీ అని వెల్లడించారు. హెచ్‌ఐవీ బాధితులకు వైద్య ఆరోగ్య శాఖ చికిత్సలు అందిస్తోందన్నారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి అరుణ సులోచనాదేవి , సీహెచ్‌ఓ రత్నాకర్ పాల్గొన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

వరదయ్యపాళెం: నెల్లటూరు మార్గంలోని మలుపు వద్ద ఆదివారం లారీ బోల్తా పడింది. శ్రీకాళహస్తి నుంచి తమిళనాడు గుమ్మిడిపూండికి ఐరన్ ఓర్ లోడ్‌తో వెళ్తున్న లారీ దారితప్పి కడూరు కూడలి నుంచి నెల్లటూరు మార్గంలో వెళ్తుండగా తాగేలి మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ రత్నంకు గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తికి తరలించారు.

రుయాలో రోగులకు తప్పని తిప్పలు

జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. పగలు 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం పది గంటలకే ఎండ తీవ్రత పెరగడంతో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రుయా ఆసుపత్రిలో రోగులకు సైతం ఎండ కష్టాలు తప్పడం లేదు. స్కానింగ్‌తోపాటు వివిధ పరీక్షల కోసం స్ట్రెచర్‌పై రోగులను తీసుకెళ్లేటప్పుడు వారి సహాయకులు తలపై గుడ్డను కప్పుతూ, ఆసుపత్రి ఫైళ్లను అడ్డుగా పెట్టాల్సి వస్తోంది. దీనికితోడు స్ట్రెచర్‌పై బెడ్ షీట్ కూడా లేకుండా రోగిని తీసుకువెళుతున్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని రోగుల సహాయకులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



మండుతున్న ఎండలో రోగి తలపై టవల్ కప్పి వార్డుకు తీసుకు వెళుతున్న సహాయకులు, సిబ్బంది



రోగి తలకు ఆస్పత్రి కాగితాలను ఎండకు అడ్డుగా పెట్టి స్కానింగ్ కోసం తీసుకువెళుతున్న దృశ్యం



భగభగ మండే ఎండలో స్ట్రెచర్‌పై బెడ్ షీట్ లేకుండా రోగిని తీసుకు వెళుతున్న వార్డు బాయ్స్

పశువుల కొనుగోలుకు రైతులకు రుణాలు

తిరుపతి అర్బన్: పాడి రైతులు పశువులను కొనుగోలు చేయడానికి రుణాలు మంజూరు చేయడానికి ప్రభుత్వ కసరత్తు చేస్తోందని జిల్లా పశువైద్యాధికారి రవికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డీఆర్‌డీఏ సెర్ప్ విభాగానికి చెందిన అధికారులు ఆ మేరకు చర్యలు ప్రారంభించారని పేర్కొన్నారు. అమూల్ పాల సేకరణలో భాగంగా జిల్లాలోని నారాయణవనం, వడమాలపేట, పుత్తూరు మండలాల్లో ఇప్పటికే 4 వేల లీటర్లకు పైగా పాల సేకరణ చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. పాల ఉత్పత్తిని పెంచడానికి పాడి రైతులకు తొలి దశలో నారాయణవనం, వడమాలపేట, పుత్తూరు మండలాల్లో రుణాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. తర్వాత జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నారని తెలియజేశారు. పాడి రైతులు తమ పరిధిలోని సచివాలయంలో ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుని ప్రయోజనం పొందాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పశువులకు నీటి కొరత లేకుండా చూడాలని తెలిపారు.

అపోలోలో వెరికోస్ వెయిన్స్ ఆధునిక వైద్య సేవలు

తిరుపతి తుడా: అపోలో ఆసుపత్రిలో అత్యాధునిక వాస్కులర్ సర్జరీ, ప్రొసీజర్స్ ద్వారా వెరికోస్ వెయిన్స్‌కు ఆధునిక వైద్య సేవలు అందిస్తున్నట్లు చెన్నై అపోలో హాస్పిటల్ డాక్టర్ వి.బాలాజీ తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక లక్ష్మీపురం సర్కిల్ సమీపంలోని అపోలో ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడారు. ఎక్కువసేపు కూర్చోవడం, నిల్చుని చేసే ఉద్యోగులు ఎక్కువ మంది వెరికోస్ వెయిన్స్ సమస్యతో బాధపడుతున్నట్టు తెలిపారు. తిరుపతిలోని అపోలో ఆసుపత్రిలో వాస్కులర్ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు వివరించారు.



డాక్టర్ వి.బాలాజీ

● ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం



జీవాగ్రంలో ఫుట్‌బాల్ శిక్షణ శిబిరంలో యువత

రేణిగుంట: మండలంలోని జీవాగ్రం మైదానంలో ఆదివారం ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. రిటైర్డ్ పీడీ సుధాకర్, పీసీసీ చైర్మన్ దివాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. జీవాగ్రం ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంప్ నిర్వాహకులు యేసురత్నం, పాల్ భరత్‌భూషణ్, జగదీష్, నవీన్, స్వామిదాసు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఉపసర్పంచ్ మృతి

పాకాల : మండలంలోని చెన్నుగారిపల్లి పంచాయతీ బార్లీకొండ బంగ్లా గ్రామానికి చెందిన కొత్తపల్లి మధునాయుడు(60) శనివారం రాత్రి మృతి చెందారు. మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చెన్నకేశవరెడ్డి, లక్ష్మయ్య, పవన్‌కుమార్, హరికృష్ణారెడ్డి, కళావతి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మధునాయుడు(ఫైల్)

రాజీవ్ గాంధీకి ఘన నివాళి



రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకల్లో కాంగ్రెస్ నేతలు

తిరుపతి అర్బన్: భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధికి రాజీవ్ చేసిన సేవలను కొనియాడారు. మాగంటి గోపాల్‌రెడ్డి, వెంకటనరసింహులు, గౌడపేరు చిట్టిబాబు, దూది రమేష్, శివశంకర్, బోయన నరేంద్ర బాబు, పోతల భాస్కర్, లీలా శ్రీనివాస్, సుప్రజ, ఖాన్, గోపిగౌడ్ పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయులకు నివాళి



పాత్రికేయులకు నివాళులర్పిస్తున్న ప్రెస్‌క్లబ్ కమిటీ, సీనియర్ జర్నలిస్టులు

తిరుపతి కల్చరల్: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన సీనియర్ పాత్రికేయులు మునిరత్నంరెడ్డి, ఎంఎస్.ప్రసాద్‌కు పలువురు జర్నలిస్టులు నివాళులర్పించారు. ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జోగిరెడ్డి భాస్కర్ రెడ్డి, కార్యదర్శి బాలచంద్ర, కోశాధికారి శ్రీకాంత్, సీనియర్ జర్నలిస్టులు రవికుమార్, ఉమామహేశ్వరరావు, నగేష్, నాగరాజు, కోలా లక్ష్మీపతి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్టు కమిషనర్ హరిత తెలిపారు. ప్రజలు ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు 0877–2227208కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అలాగే స్పందనలో నేరుగా కమిషనర్‌ను కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదులు అందజేయవచ్చని వివరించారు.

మురుగుకు శాశ్వత పరిష్కారం

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి చొరవ
- అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు



రోడ్డుపై సిమెంట్ పనులు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భూమన అభినయ్‌రెడ్డి



ఉపాధ్యాయ నగర్ మెయిన్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలోని 45వ డివిజన్ శ్రీనిధి అపార్ట్‌మెంట్, అయ్యప్ప కాలనీ, ప్రగతి నగర్ తదితర ప్రాంతాల వారు దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బంది పడుతున్న మురుగు సమస్యకు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పరిష్కారం చూపించారు. తిరుమల బైపాస్ రోడ్డు శ్రీవారి సన్నిధి ఎదురుగా ఎస్‌బీఐ ఏటీఎం పక్కన అయ్యప్పకాలనీ మీదుగా జీవకోనకు వెళ్లేందుకు శ్రీనిధి అపార్టుమెంట్ రోడ్డు ఉంది. దీనికి దక్షిణ భాగంలో ఖాళీ స్థలం ఉంది. ఈ రోడ్డు ఎత్తు పెంచే పరిస్థితి లేకపోవడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు, వర్షపు నీరు రోడ్డుపై చేరుతోంది. రోజుల తరబడి మురుగు నీరు నిలుస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గతంలో అధికారులు, పాలకులకు విన్నవించినా ఫలితం లేదు. ఈ క్రమంలో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీటిని శ్రీనిధి అపార్టుమెంట్ ప్రాంగణం నుంచి ఈశాన్యంలో దక్షిణం వైపునకు మళ్లించారు. అక్కడి నుంచి యూడీఎస్ లైన్‌కు లింక్ కలిపారు. శనివారం రాత్రికి రాత్రే యూడీఎస్ పనులను పూర్తి చేసి శభాష్ అనిపించుకున్నారు. కాలువలను నిర్మించి కొత్త రోడ్డు వేయనున్నట్టు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. వీలైనంత త్వరగా పెండింగ్ పనులను పూర్తి చేస్తామని చెప్పారు. స్థానిక కార్పొరేటర్ డాక్టర్ అనీష్‌కుమార్, ఎస్‌ఈ మోహన్, ఎంఈ వెంకటరామిరెడ్డి, డీఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షులు అర్జున్‌యాదవ్, నాయకులు కదిరి రాజేంద్ర, అమర్‌నాథరెడ్డి, రాజేశ్వరి, చిన్న, సిద్ధూ, శ్రీనిధి అపార్టుమెంట్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా ఇటీవల నూతనంగా నిర్మించిన సామవాయి మార్గం (చింతలచేను మాస్టర్ ప్లాన్ రోడ్డు)పై భవన నిర్మాణ సామగ్రి వేయడాన్ని గుర్తించిన డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా వేసిన ఈ రోడ్డుపై కంకర, ఇసుక, సిమెంట్‌ను వేసి మిక్సింగ్ చేస్తుండడంపై మండిపడ్డారు. రోడ్డును పాడు చేసేలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని నిలదీశారు. అక్కడే ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారులు భవన నిర్మాణ యజమానికి జరిమానా విధించారు. అలానే ఉపాధ్యాయనగర్ మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు.

కనుల పండువగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



భక్తులకు అన్నదానం చేస్తున్న వీరబ్రహ్మం

తిరుపతి కల్చరల్: మహతిలో ఆదివారం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.భారతి ఆధ్వర్యంలో టీటీడీ సహకారంతో నిర్వహించిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. ఇందులో భాగంగా ఉదయం విఘ్నేశ్వరపూజ, హోమం, విశ్వకర్మ మహాయాగం, గణపతి హోమం, సుదర్శన హోమం, మహాలక్ష్మీ హోమం, మృత్యుంజయ హోమం, ఆయుష్షు, సౌభాగ్య హోమాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీగోవిందమాంబ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 2.05 నుంచి 4 గంటల వరకు కల్యాణోత్సవం వేడుకగా చేపట్టారు. కర్ణాటక ఆశ్రమం శివసిద్ధేనందస్వామి, కాశీ కైలాస మఠం జ్యోతిరాధానంద స్వామి అనుగ్రహణ భాషణం చేశారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. సుధా బ్రహ్మ స్టీల్స్ అధినేత వీరబ్రహ్మం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి వారి వంశీయులైన 8వ తరం మునిమనవడు నొస్సం వీరభట్లయ్య స్వామి, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు గిరిబాబు ఆచారి, మార్గాచార్యులు ఉమాపతి ఆచారి, కార్తీక్ ఆచారి, శివాచారి, మురళీకృష్ణ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

వేషాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్ : వేషాలమ్మను ఆదివరాం తెలంగాణ రాష్ట్రం కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నేత సునీల్‌చక్రర్తి పాల్గొన్నారు.



తిరుపతి టీచర్‌కు దుబాయ్‌లో అవార్డు ప్రదానం

తిరుపతి కల్చరల్: చంద్రగిరి మండలం శానంబట్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కమతం రెడ్డిప్రసాద్ విశిష్ట తెలుగు జానపద సామ్రాట్ అవార్డు అందుకున్నారు. దుబాయ్‌లో శనివారం రాత్రి కల్చరల్ సమ్మిట్ అండ్ ఇంటర్నేషనల్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్–2023 పేరుతో తెలుగు అసోసియేషన్ ఆఫ్ మలేషియా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డిప్రసాద్‌కు తెలుగు జానపద సామ్రాట్ అవార్డు, సంస్థ జ్ఞాపికను బహూకరించి ఘనంగా సత్కరించారు. రెడ్డిప్రసాద్‌కు అవార్డు రావడంపై తిరుపతి, చిత్తూరు జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలు, రైల్వే యూనియన్ నాయకులు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు రెడ్డిప్రసాద్

శ్రీవారి సేవలో ప్రముఖులు



డిప్యూటీ సీఎం నారాయణస్వామి



ఎంపీ ఆర్ కృష్ణయ్య



సినీ నటుడు రాజశేఖర్

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, ఎంపీ ఆర్.కృష్ణయ్య, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, పుదుచ్చేరి డిప్యూటీ స్పీకర్ రాజవేలు, మాజీ మంత్రి రెడ్డి వారి జంగారెడ్డి, సినీ నటులు రాజశేఖర్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఆలయం వెలుపల ఎంపీ కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో 56 శాతం జనాభా కలిగిన బీసీలకు ఇంకా అన్యాయం జరుగుతోందన్నారు. విద్య, ఆర్థిక, వైద్య, రాజకీయ రంగాల్లో సమన్యాయం జరగడం లేదన్నారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కావాలన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లకు అనేక రకాల అడ్డంకులు వస్తున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి మోదీకి బీసీల విషయంలో మంచి బుద్ధిని స్వామి వారు కలిగించాలని కోరుకున్నట్టు వెల్లడించారు. అవినీతితో రాజకీయ నాయకులు కోట్లకు పడగలెత్తుతున్నారని, పేదలకు న్యాయం జరగాలంటే అవినీతి నిర్మూలన జరగాలని పేర్కొన్నారు.

– డిప్యూటీ సీఎం నారాయణ స్వామి మాట్లాడుతూ ఎవరికీ భయపడి ముందస్తు ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరం తమ పార్టీకి లేదన్నారు. దీనిపై అపోహలు నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'నేను, చంద్రబాబు ఒకే వయసు వారం.. వయసు పెరిగే కొద్దీ శ్మశానంలో స్థలం దక్కుతుందో లేదో అని ఆలోచన వస్తుంది. అదే ఆలోచనలో చంద్రబాబు ప్రస్తుతం ఉన్నారు' అని చెప్పారు. పేదరికంలో పుట్టిన చంద్రబాబు పేదరికాన్ని మరిచి ప్రవర్తిస్తున్నారన్నారని, పేదలకు ఇంటి స్థలాలు ఇస్తున్న సీఎం జగన్‌ను చూసి విమర్శలు చేయడం మంచిది కాదన్నారు. బాబును పూడ్చేందుకు కూడా ఆరడుగుల భూమి కావాల్సిందేనని తెలిపారు. అమరావతిలో పేదవాడు ఉండకూడదని మాట్లాడిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. చరిత్రలో ఎప్పుడూ చంద్రబాబు పేదలకు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టించిన దాఖలాలు లేవన్నారు. బాబు, రామోజీరావు అక్రమాలను జగన్ బయట పెడుతున్నారని తెలిపారు.

భూసార పరీక్ష.. నేలకు రక్ష

భాకరాపేట : రైతు తన పొలంలో భూసార పరీక్షలు చేయించుకుని పంటలు సాగు చేస్తే మంచి ప్రయోజనం ఉంటుందని చిన్నగొట్టిగల్లు వ్యవసాయ అధికారి ధనలక్ష్మి తెలిపారు. నేల స్వభావంతో పాటు ఏ పంటలు సాగు చేయాలి, ఎలాంటి ఎరువులు వేయాలి తదితర వివరాలు తెలియాలంటే భూసార పరీక్షలు తప్పనిసరని పేర్కొన్నారు. ఫలితాలను బట్టి ఎరువులు వాడితే పెట్టుబడి తగ్గడమే కాక అధిక దిగుబడి సాధించవచ్చని చెప్పారు. నెల రోజుల్లో ఖరీఫ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

పరీక్షలతో లాభాలు..

పొలంలోని ప్రధాన, సూక్ష్మ పోషకాల స్థాయిని తెలుసుకోవచ్చు. ఏ పంటకు ఏయే ఎరువులు, ఎంత మోతాదులో వేయాలనే విషయాలు తెలుస్తాయి. పొలాల్లో చౌడు, ఆమ్ల స్థాయిని నిర్ధారించుకుని వాటిని తగ్గించేందుకు అవసరమైన యాజమాన్య పద్ధతులు పాటించవచ్చు.

వెంటనే ఫలితాలు..

గతంలో భూసార పరీక్షల ఫలితాలు రావడానికి నెలలు పట్టేది. దాంతో రైతులు వాడిన మందులనే వాడుతూ నష్ట పోయేవారు. ఈ పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం ప్రస్తుతం ప్రతి మండలానికి భూసార పరీక్ష కిట్లను అందజేసింది. మండలంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతుల పొలాల్లోనే పరీక్షలు చేసి అక్కడికక్కడే ఫలితాలు తెలియజేస్తున్నారు. ఆ రైతుకు భూసార ఆరోగ్య కార్డును అందజేస్తున్నారు.



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

కబడ్డీ టోర్నీ ప్రారంభం

నింద్ర: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని నగరి రూరల్ సీఐ రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అంబేడ్కర్ కబడ్డీ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులు మానసికంగా, దృఢంగా ఉంటారన్నారు. క్రీడల్లో పాల్గొని విద్యార్థులు గొడవలకు జరగకుండా సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ జయశ్రీ, వైస్ ఎంపీపీ శుభ, ఎస్‌ఐ శివశంకర్, నాయకులు సంపత్, కాటయ్య, ఏలుమలై, బాబు, పాండియన్, ఆర్గనైజర్స్ సతీష్, వెంకటేష్, జాషువా, పవన్, జాన్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.